# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-12-2024** **సమయం : 3.00 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి శతజయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్మారక తపాలాబిళ్ల, నాణేలను విడుదల చేశారు**
2. **ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్డీయే కూటమి సమావేశంలో పాల్గొన్నారు.**
3. **ప్రజారోగ్యానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **పదవ తరగతి పరీక్షల రుసుము గడువును రాష్ట్ర విద్యాశాఖ పొడిగించింది.**
5. **విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో భవానీ దీక్ష విరమణలు ఈ రోజుతో ముగియనున్నాయి.**

==========================

సుపరిపాలనకు భారత్ చిహ్నంగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి ఈ రోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి శతజయంతి సందర్భంగా స్మారక తపాలాబిళ్ల, నాణేలను విడుదల చేశారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ( 28 సెకన్లు)

--------------------------

మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతి సందర్భంగా ఢిల్లీలోని ఆయన సమాధి 'సదైవ్ అటల్' వద్ద ప్రముఖులు ఈ రోజు నివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభాపతి ఓం బిర్లా, కేంద్రమంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు పార్లమెంట్ సభ్యులు వాజ్‌పేయీకి అంజలి ఘటించారు.

వాజ్‌పేయి స్వావలంబన కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి తన జీవితాన్ని అంకితం చేశారని. ఆయన దార్శనికత లక్ష్యం కొనసాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం "ఎక్స్" లో పేర్కొన్నారు.

--------------------------

దేశంలో మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తూ, ఆర్థిక పురోభివృద్ధికి అటల్ బిహారీ వాజ్ పేయి కృషి చేశారని మిజోరామ్ గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన వాజ్ పేయి శత జయంతి వేడుకల్లో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజ్ పేయి జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను ఆయన వీక్షించారు. అనంతరం హరిబాబు మాట్లాడుతూ, అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి రోజు సుపరిపాలనా దినోత్సవంగా జరుపుకోవడం ముదావహం అని అన్నారు. ఆయన దూరదృష్టి వల్లే నేడు భారత్ ప్రపంచదేశాలతో పోటీ పడుతోందని వివరిస్తూ.

వాయిస్ ( 27 సెకన్లు)

---------------------------

ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం భారతీయ జనత పార్టీ అధ్యక్షులు జేపీ నడ్డా నివాసంలో జరుగుతున్న ఎన్డీయే రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ముఖ్యనేతల సమావేశానికి హాజరయ్యారు. అనంతరం పలువురు కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, 6 గంటలకు కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ప్రజారోగ్యానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు , వ్యర్థాల నిర్వహణకు ట్రాక్టర్ లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వివిధ రకాల వ్యాధుల చికిత్సకు ఆర్థికంగా దోహపడేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతోందని అన్నారు. రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 17 సెకన్లు)

---------------------------

కేంద్ర ప్రభుత్వం 15 వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల కోసం రాష్ట్రానికి 446.49 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2వ విడత నిధుల కింద 420.99 కోట్ల రూపాయలతో పాటు, తొలివిడత బకాయి నిధులు 25.50 కోట్లు కూడా విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిధులను అర్హత కలిగిన 13,097 గ్రామ పంచాయతీలకు, 650 బ్లాక్ పంచాయతీలకు రాష్ట్రంలోని మొత్తం 13 జిల్లా పంచాయతీలకు ఇవ్వనునున్నట్లు కేంద్రం పేర్కొంది.

---------------------------

రాష్ట్రంలో పదవ తరగతి సార్వత్రిక పరీక్షలకు రుసుము చెల్లించని విద్యార్థుల అభ్యర్థన మేరకు తత్కాల్ అవకాశం కల్పించినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కేవీ శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తత్కాల్ కింద 1000 రూపాయల ఆలస్య రుసుంతో ఈనెల 27 నుంచి జనవరి 10 వరకు పరీక్ష ఫీజు

చెల్లించవచ్చని పేర్కొన్నారు.

---------------------------

వ్యవసాయంలో సాంకేతికతకు ప్రాధాన్యమిస్తూ, డ్రోన్ వినియోగంపై రైతులకు శిక్షణ ఇస్తున్నామని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షులు గా మర్రిరెడ్డి శ్రీనివాస రెడ్డి నిన్న బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,రైతులకు మేలు కలిగేలా "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశామన్నారు. వ్యవసాయ ఖర్చులు తగ్గించేందుకు, సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో భవానీ దీక్ష విరమణలు ఈ రోజుతో ముగియనున్నాయి. భవానీ దీక్షాధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్షలు విరమిస్తున్నారు. చివరి రోజు కావడంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశముందని దేవస్థానం అధికారులు తెలిపారు. జిల్లా యంత్రాంగం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని క్యూ లైన్లలో ఉచిత దర్శనం కల్పిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

---------------------------

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం-పీఎంఈజీపీపై జనవరి నుంచి నియోజకవర్గాల వారీగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో పీఎంఈజీపీ పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి శాఖల అధికారులు జిల్లా కలెక్టర్ తో కలిసి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రెడిట్ లింక్డ్ రాయితీ పథకమైన పీఎంఈజీపీపై పెద్దఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాజెక్టు రూపకల్పన, దరఖాస్తు విధానం, రాయితీ, రుణ సదుపాయం, మార్కెటింగ్ అవకాశాలు, పరిశ్రమను విజయవంతంగా నడిపేందుకు ప్రణాళిక వంటి అంశాల పైనా అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.

---------------------------

ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని విశాఖపట్నం జిల్లా వివాదాల పరిష్కార కమిషన్ సభ్యులు వి. కృష్ణమూర్తి తెలిపారు. సుపరిపాలన దినోత్సవం సందర్భంగా ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ,

వాయిస్ ( 28 సెకన్లు)

---------------------------

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట కోదండరామాలయంలో వచ్చే ఏడాది ఏప్రిల్ 6 నుంచి 14 వరకు శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని టిటిడి ఉప కార్యనిర్వహణాధికారి పి.వి.నటేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అదే నెల 5న ఉత్సవాలకు అంకురార్పణ చేస్తామని, 6న ధ్వజారోహణం, 10న గరుడ సేవ, 11న సీతారాముల కల్యాణ మహోత్సవం, 12న రథోత్సవం, 14న పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

---------------------------

రాష్ట్రంలో నేర విచారణ వ్యవస్థ –సీసీటీఎన్ఎస్ ను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ అండ్ నెట్వర్క్ సిస్టమ్, ఇంటర్ ఆపరెబల్ క్రిమినల్ జస్టిస్ సిస్టంలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం నిన్న ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి అధ్యక్షతన జరిగాయి.

=======================